

కొండల్లో ఉమామహేశ్వరుడు
శ్రీశైలం ఉత్తర ద్వారంగా భాసిల్లుతున్న ఉమా మహేశ్వరం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది.

వివరాలు 10లో ▸



ఉత్సాహంగా..
పాలమూరులో సీనియర్ నేషనల్ నెట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /14.5

వాతావరణం
చలి ప్రభావం అధికంగా ఉంటుంది. విపరీతమైన మంచు కురుస్తుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల సీఓఈ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గురుకులాల అధికారి దానం శనివారం ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశానికిగాను ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీఓఈలో సీటు సాధించిన విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు నీట్, ఎంబీబీఎస్, ఐఐటీలపై ప్రత్యేక తరగతులు ఉంటాయని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సార్వత్రిక డిగ్రీలో స్పాట్ అడ్మిషన్స్

కందనూలు: 2023–24 విద్యాసంవత్సరం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో స్పాట్ అడ్మిషన్స్‌కు అవకాశం కల్పించినట్లు సమన్వయకర్త వర్కాల శ్రీనివాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్ లేదా ఏదైనా రెండేళ్ల డిప్లొమా కోర్సు, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా నేరుగా అడ్మిషన్ పొందాలని సూచించారు. అదేవిధంగా డిగ్రీ ద్వితీయ సంవత్సరం 3వ సెమిస్టర్ పరీక్ష ఫీజు, తృతీయ సంవత్సరం 5వ సెమిస్టర్ పరీక్ష ఫీజు ఈనెల 17వ తేదీలోగా చెల్లించాలని కోరారు. వివరాలకు నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లేదా 7382929779 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

తెలంగాణ సంస్కృతిని కాపాడుకుందాం



తాడూరు: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. తాడూరులో శనివారం అంతరాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. మొత్తం 12 జతల వృషభరాజులు పాల్గొనగా.. బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు అందరిలో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తిస్తాయన్నారు. పోటీతత్వంతోనే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. క్రీడాపోటీల నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రోహిణి, సర్పంచ్ యాదమ్మ, ఎంపీటీసీ రేణుక పాల్గొన్నారు.

ఆలిండియా వాలీబాల్‌లో అనన్యశ్రీ ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలోని మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్‌లో విశేష ప్రతిభ కనబరుస్తోంది. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఈ నెల 9 నుంచి శనివారం వరకు జరిగిన ఆలిండియా యూనివర్సిటీలో అనన్యశ్రీ ఎంజీ యూనివర్సిటీ తరఫున ఆడింది. ఈ పోటీల్లో ఎంజీ యూనివర్సిటీ చాంపియన్‌గా నిలవడంతో అనన్యశ్రీ బంగారు పతకాన్ని సాధించింది. వాలీబాల్‌లో రాణించిన అనన్యశ్రీ 2019లో ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా అథ్లెట్ పథకం కింద కేరళలోని పట్టణమిట్టలోగల వాలీబాల్ అకాడమీకి ఎంపికై శిక్షణ తీసుకుంటుంది. అనన్యశ్రీ మొదట్లో తెలంగాణ రాష్ట్రం, ప్రస్తుతం కేరళ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. కేరళ తరఫున అస్సాం రాష్ట్రం గౌహతిలో గతేడాది జరిగిన 71వ వుమెన్ సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు కేరళ రాష్ట్ర జట్టుకు అనన్యశ్రీ ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాన్ని సాధించింది. అనన్యశ్రీ తొలిసారిగా చైనా దేశం చెంగ్డ్ నగరంలో గతేడాది జూలైలో వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆలిండియా యూనివర్సిటీ వాలీబాల్ జటుకు ప్రాతినిధ్యం వహించింది. అనన్యశ్రీ బంగారు పతకం సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనంద్, వరలక్ష్మి, మహబూబ్‌నగర్ డీఎస్‌ఏ వాలీబాల్ కోచ్ పర్వేజ్‌పాష హర్షం వ్యక్తం చేశారు.

కంది క్వింటా రూ.8,970

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం కందులకు క్వింటాలు గరిష్ఠంగా రూ.8,970, కనిష్ఠంగా రూ.8,470 ధర లభించింది. అలాగే వేరుశనగ క్వింటాలు గరిష్ఠంగా రూ.8,031, కనిష్ఠంగా రూ.5,411, పత్తికి గరిష్టంగా రూ.6,690, కనిష్టంగా రూ.4,989, ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం క్వింటాలు గరిష్టంగా రూ.2,937, కనిష్టంగా రూ.2,789, హంస రకానికి రూ.1,980, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,301, కనిష్టంగా రూ.2,180 చొప్పున వచ్చాయి.

సంక్రాంతి శోభ..



భోగి మంటలు వేసిన ప్రజలు (ఫైల్)

- పిల్లల ఆటపాటలు, బంధువుల రాకతో సందడి
- ఘుమఘుమలాడుతున్న పిండి వంటలు
- పల్లెల్లో ఉట్టిపడుతున్న పండగ కళ

అచ్చంపేట: పల్లెలు, పట్టణాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పిల్లల ఆటపాటలు, బంధువుల రాకపోకలతో సందడిగా మారాయి. సంక్రాంతి పర్వదినం ముందు రోజు వచ్చేది భోగి. భోగభాగ్యాలను అందించే ఈ పండగ తెలుగు ప్రజల సంస్కృతిని ప్రతిబింబిస్తోంది. ఆదివారం ఆనందోత్సాహాలతో పండగను జరుపుకొనేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి, భోగి మంటలు వేయడంతో పాటు నువ్వులతో అభ్యంగన స్నానాలు ఆచరించనున్నారు. ఇంటి ముగిళ్లలో రంగవల్లులతో సందడి వాతావరణం కనువిందు చేయనుంది. పిల్లలకు భోగిపండ్లు పోసి ఆశీర్వచనం ఇస్తారు. కొందరు బొమ్మల కొలువు నిర్వహిస్తారు. యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగరవేస్తూ సందడి చేస్తున్నారు. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల వారి డూడూ బసవన్నలతో విన్యాసాలు చేస్తూ.. పండగకు ప్రత్యేక శోభ తీసుకొస్తారు. రెండో రోజు సంక్రాంతి, మూడో రోజు కనుమ పండగ నిర్వహించుకోనున్నారు.

భోగి పులక..

సంక్రాంతికి పంటలు చేతికందిన తర్వాత రైతులు రెండో పంట వేసుకునేందుకు పొలాల్లో కొంత మేర నీరు పారించి భూమిని తడుపుతారు. దీన్ని పులక వేయడం అంటారు. సంక్రాంతి పర్వదినాల్లో తొలి పండగను భోగి భాగ్యాల పండగ అని పిలుస్తారు.

15న మకర సంక్రాంతి..

సంక్రాంతి అంటే గమ్యం అని అర్థం. సూర్యుడు ధనురాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించే కాలాన్ని మకర సంక్రమణం అంటారు. ఇంటి ముంగిట కల్లాపి చల్లి, ముగ్గులు వేయడం వల్ల లోగిళికి అందం చేకూరుతోంది. అదేవిధంగా నువ్వులు, బెల్లం కలిపి పులగం, లడ్డూలు తయారు చేసుకుంటారు. సకల సౌభాగ్యం కోసం సంక్రాంతి నోము నోచుకుంటారు. లక్ష్మీదేవిని పూజించి, నువ్వుల లడ్డూ ప్రసాదం స్వీకరిస్తారు.

16న కనుమ..

సంక్రాంతి మరుసటి రోజు కనుమ జరుపుకోవడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. కనుమను కల్పవు పండగ అని కూడా అంటారు. ఈ రోజున గోపూజ చేయడం ఆచారం. రైతులు తమ ఎడ్లను ప్రత్యేకంగా అలంకరిస్తారు. పశువులను దైవంగా భావించి, పూజించడం కనుమ పర్వదినం ప్రత్యేకత.

ఇదీ భోగి విశిష్టత..

ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు భోగి పండగ రోజు ఇంద్రుడికి ప్రత్యేక పూజలు చేస్తాడు. మీరు కూడా చేయాలని యాదవులకు ఆజ్ఞాపించారని పురాణాలు చెబుతున్నాయి. ఇదే రోజు శ్రీరంగనాథుడిని గోదాదేవి వివాహం చేసుకుంది. దీంతో ఏటా వైష్ణవాలయాల్లో భోగి పర్వదినం రోజు గోదాదేవి కల్యాణం నిర్వహిస్తారు. ఈరోజు వ్యవసాయదారులు వినియోగించే పనిముట్లు, కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలను ఇంద్రుడిగా భావించి, ప్రత్యేక పూజలు చేస్తారు. పలు ప్రాంతాల్లో బలి చక్రవర్తిని పూజిస్తారు. ఉదయాన్నే భోగి మంటలు వేసి, ఇంట్లోని పాత వస్తువులను కాల్చేస్తారు. భోగి మంట వేయడం వల్ల ఇంట్లోని దారిద్ర్య దేవతను తరిమినట్లు హిందువులు విశ్వసిస్తారు. ఆడవాళ్లు వాకిట్లో రంగవల్లులు తీర్చిదిద్దుతారు. ఆవు పేడతో తయారు చేసిన గొబ్బెమ్మను పసుపు, కుంకుమ, గరిక పోచలతో అలంకరిస్తారు. రేగు పండ్లు, నవధాన్యాలు పోసి, తమ ఇళ్లు పాడి పంటలు.. సిరిసంపదలతో తులతూగాలని మనసారా మొక్కుకుంటారు.

పిండి వంటల ఘుమఘుమలు..



సంక్రాంతి పండగ సందర్భంగా పిండివంటలు ఘుమఘుమలాడనున్నాయి. సంక్రాంతి అనగానే ముందుగా గుర్తుచ్చేవి అరిసెలు. బియ్యం పిండి, నూనె, బెల్లం, నువ్వులతో తయారు చేసే అరిసెలు ఆరోగ్యానికి మంచిది. అదేవిధంగా బియ్యం పిండి, కొబ్బర, నువ్వుల పిండితో బూరెలు చేస్తారు. వీటికి తయారీకి కొందరు పంచదార పాకాన్ని వాడతారు. అలాగే నువ్వుల ఉండలు, కజ్జికాయలు కూడా సంక్రాంతి స్పెషల్ వంటకాలు. వీటితో పాటు సజ్జపిండి, నేతితో చేసిన గారెలు, పాయసం, పరమాన్నం, జంతికలు తయారుచేస్తారు.

మార్కెట్లు కిటకిట..

సంక్రాంతి పండగ నేపథ్యంలో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. కిరాణా దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసి కనిపించాయి. అలాగే చిన్నారులకు భోగిపండ్లు పోసేందుకు కొత్త దుస్తులు కొనుగోలు చేశారు. భోగి రోజు నువ్వుల రొట్టెలు ఆరగించేందుకు చిక్కుడు కూర ప్రత్యేకం కావడంతో ధర అమాంతం పెరిగిపోయింది. కిలో రూ.వంద వరకు విక్రయించారు.

కాంగ్రెస్‌లోకి మన్నె జీవన్‌రెడ్డి

- ఢిల్లీలో ఏఐసీసీ నేతను కలిసి మంతనాలు
- ఎమ్మెల్సీనా.. ఎంపీ కోసమా అనేది సస్పెన్స్
- పాలమూరులో బాబాయ్.. అబ్బాయ్ మధ్య పోటీ?



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారన్న ప్రచారం ఊపందుకుంది. శనివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను ఢిల్లీలో కలవడం ఇందుకు బలం చేకూర్చింది. మన్నె జీవన్‌రెడ్డి ప్రస్తుత మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి స్వయానా సోదరుడి కుమారుడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో జడ్చర్ల బీఆర్ఎస్ టికెట్ తనకే వస్తుందని చివరి దాక చెబుతూ వచ్చిన ఆయన టికెట్ రాకపోవడంతో మిన్నంకుండిపోయారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో మళ్లీ మన్నె జీవన్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర వస్తున్న సమయంలో కాంగ్రెస్‌లో చేరి పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే సొంత బాబాయ్ ప్రస్తుత ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో అబ్బాయ్ మన్నె జీవన్‌రెడ్డి తలపడే పరిస్థితి ఉంటుంది. ఇదే జరిగితే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోరు రసవత్తరం కానుంది. ఒకవేళ బీఆర్ఎస్ అభ్యర్థిని మారిస్తే కాంగ్రెస్ నుంచి కూడా కొత్త అభ్యర్థి పేరు తెరపైకి రావొచ్చు. అభ్యర్థుల ఖరారు తర్వాత జిల్లాలో రాజకీయ సమీకరణలు మరింత మారే అవకాశాలు ఉన్నాయి.

చేరికకు సర్వం సిద్ధం

కాంగ్రెస్‌లో చేరేందుకు మన్నె జీవన్‌రెడ్డి సర్వం సిద్ధం చేసుకున్నారు. ఈ నెలాఖరులో కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు ముహూర్తం కూడా ఖరారు అయ్యింది. అయితే ఇందుకు వేదిక హైదరాబాదా.. ఢిల్లీనా అన్న విషయం తేలాల్సి ఉంది. ఇప్పటికే ముఖ్య నేతలను కలిసి ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా సేవలు

జడ్చర్ల నియోజకవర్గంలోని నవాబ్‌పేట మండలం గురుకుంట గ్రామానికి చెందిన మన్నె జీవన్‌రెడ్డికి ఎంఎస్ఎన్ ఫార్మా పరిశ్రమ అధినేతగా, టీటీడీ బోర్డు సభ్యులుగా మంచి గుర్తింపు ఉంది. రాజకీయాలకు అతీతంగా పలు సేవా కార్యక్రమాల్లో ఆయన ముందున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నేరుగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం పట్ల మన్నె జీవన్‌రెడ్డి వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్‌కు దెబ్బ

మన్నె జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతుండడంతో బీఆర్ఎస్‌కు కొంత మేరకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా జడ్చర్ల నియోజకవర్గంలో ఆ ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. మొదటి నుంచి మన్నె జీవన్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకం ఉన్న అనుచర గణం సైతం కాంగ్రెస్ వైపు వెళ్లవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

ఎమ్మెల్సీ సీటుపైనే..

కాంగ్రెస్‌లో చేరుతున్న మన్నె జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ సీటు కోసమే మొగ్గు చూపుతున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి ఇప్పటికే వంశీచంద్‌రెడ్డి పేరు ఖరారు దిశలో ఉన్న నేపథ్యంలో తాను ఎమ్మెల్సీ పదవిని కోరాలని నిర్ణయించుకున్నట్లు మన్నె జీవన్‌రెడ్డి 'సాక్షి'తో చెప్పారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

వివరాలు 8లో ▸

- బీచుపల్లి వద్ద అగ్నికి ఆహుతైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- స్థానికులు, హైవే సిబ్బంది చొరవతో తప్పిన ప్రాణనష్టం
- వరుస ప్రమాదాలతో స్థానికుల ఉలిక్కిపాటు
- 2013లో పాలెం దుర్ఘటనలో 45 మంది సజీవ దహనం



గిరిజనోద్ధరణ..

ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి 'పీఎం జన్ మన్ యోజన పథకం'

- 15వ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్రమోదీ
- మన్ననూర్ గిరిజన గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఏర్పాట్లు
- జిల్లాలో 2,600 చెంచు కుటుంబాలు
- మూడేళ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



చెంచుల బొడ్డుగుడిసెలు

అచ్చంపేట: ఆదిమ గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్ యోజన) పథకంతో చెంచుపెంటలు, గూడేలలో సకల సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆదివాసీ గిరిజనులకు పలు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. విద్య, వైద్యం ఉపాధి కల్పన అవకాశాలను మెరుగు పర్చనున్నారు. ఈనెల 15న ఈపథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఈసందర్భంగా 1,000 మంది చెంచులతో ప్రధానమంత్రి పర్చువల్‌గా నిర్వహించే సమావేశానికి మన్ననూర్ ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాల (పీటీజీ) వేదిక కానుంది. జిల్లాలోని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఇక్కడ పథకాన్ని ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు ప్రత్యేక మెడికల్ వాహనాన్ని ప్రారంభించనున్నారు.

మూడేళ్ల కాలంలో..

జిల్లాలో 88 చెంచుపెంటలు ఉండగా.. 2,600 కుటుంబాలు ఉన్నాయి. 8,560 మంది చెంచులు జీవనం సాగిస్తున్నారు. వీరిలో 1,030 మందికి నివాసగృహాలు లేవని అధికారులు గుర్తించారు. ఇల్లు లేని వారికి పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రతిపాదించారు. మూరుమూల గ్రామాలు, చెంచుపెంటల్లో గిరిజనులకు కనీస సౌకర్యాలు కల్పించి, సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. జిల్లాలో 2023–24, 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాల్లో ఈపథకాన్ని అమలు చేయనున్నారు.

గూడేలకు మహర్దశ..

ఆదిమ గిరిజనులు (పీవీటీజీ) నివసించే చెంచుపెంటలు, గూడేలలో కనీస సౌకర్యాలకు నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్య, వైద్య అందడం లేదు. ఉపాధి అవకాశాలు లేవు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకాన్ని పకడ్బందీగా అమలుచేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు చేపడుతోంది. కిసాన్ క్రెడిట్, ఆధార్, జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్లు, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తారు. ఎంపిక చేసిన గ్రామంలో అంతర్గత రోడ్లు, మండల కేంద్రానికి అనుసంధానం చేసే రహదారులు, పక్కా గృహాలను నిర్మిస్తారు. చెత్తకుండీల ఏర్పాటుతో పాటు డ్రెయినేజీలు, డంపింగ్‌యార్డు నిర్మించనున్నారు. ఇంటింటికీ నల్లాలను ఏర్పాటు చేస్తారు. విద్యుత్ సౌకర్యం లేనిచోట సౌరశక్తితో అవసరాలను తీర్చనున్నారు. ఇంటింటికీ వంట గ్యాస్, స్టౌవ్‌లను అందజేస్తారు.

వ్యవ'సాయం'

పంటల సాగుకు కావాల్సిన ఎడ్లు, పనిముట్లు, ట్రాక్టర్లను రాయితీపై అందజేయనున్నారు. గిరి వికాసం కింద వ్యవసాయ పొలాల్లో బోరుబావులు తవ్వించడంతో పాటు విద్యుత్ మోటార్ సౌకర్యం కల్పించనున్నారు. రైతులకు సాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతారు.

ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం...



పీఎం జన్‌మన్ యోజన పథకం కింద చెంచుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. ఈనెల 15న ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెంచులతో పర్చువల్‌గా మాట్లాడుతారు. అదే రోజు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా చెంచులకు కిసాన్ క్రెడిట్, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తాం. అదేవిధంగా ప్రత్యేక మెడికల్ వాహనం ప్రారంభిస్తారు. ఏడు చెంచుపెంటల్లో మల్టీపర్పస్ సెంటర్‌ను రూ.60 లక్షలతో ఏర్పాటు చేస్తాం. ఉపాధి పరంగా ఆర్థికతోడు అందించే కార్యక్రమాలు చేపడతాం.

– ఉదయ్‌కుమార్, కలెక్టర్

ఉపాధి అవకాశాలు..

చెంచులను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు ఆరు యూనిట్లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్‌కు రూ.25 లక్షల మంజూరు చేస్తారు. వ్యవసాయాధారిత యూనిట్లను నెలకొల్పి, కుటీర పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తారు. ఒక్కో యూనిట్‌కు 10 మందిని ఎంపిక చేసి, నిరుద్యోగ యువత ఆసక్తి మేరకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తారు. వీరికి ఐటీడీఏ ద్వారా ఉచిత భోజనం, నివాస వసతి కల్పిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటారు.

ఐటీడీఏ కీలక పాత్ర..

పీఎం జన్‌మన్ యోజన పథకం అమలులో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) కీలక పాత్ర పోషించనుంది. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఏపీఓ, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్, ఏజెన్సీ వైద్యశాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, విద్యుత్, అటవీశాఖ, ఐసీడీఎస్, వ్యవసాయశాఖల భాగస్వామ్యంతో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

విద్య, వైద్యం..

గిరిజన నివాసిత ప్రాంతాల్లోని పాఠశాలలను బలోపేతం చేయనున్నారు. ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాలు విద్యార్థులకు సరళంగా అర్థమయ్యేలా విద్యాబోధన అందించేందుకుగాను ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. గ్రామాలు, పెంటల సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టనున్నారు. అదేవిధంగా మొబైల్ మెడికల్ యూనిట్ ఏర్పాటు చేస్తారు. 6 వన్‌ధన్ వికాస్ కేంద్రాలు, 23 మల్టీపర్పస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ప్రతి వంద కుటుంబాలకు ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తారు. చెంచుగూడేలలో ఒకేషనల్ విద్యా కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. చెంచులకు కిసాన్ కార్డులు అందించడంతో పాటు ఆయుష్మాన్ భారత్ కార్డులతో గర్భిణులకు ప్రసవ సమయంలో కొంత ఆర్థిక సాయం అందజేస్తారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి


జాలం నాగేష్ (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్ చెందిన జాలం నాగేష్ (28) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగ ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం జాలం నాగేష్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో ఆర్టీసీ బస్సు నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తుండగా నాగేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అక్కడిక్కడే నాగేష్ మృతి చెందాడు. నాగేష్‌కు ఆరు నెలల క్రితమే వివాహమైంది. మరణ వార్త విన్న కుటుంబ సభ్యుల, బంధువుల రోదనలు మిన్నంటాయి.

నీటి సంపులో పడి వ్యక్తి..


లోకేష్ (ఫైల్)

బిజినేపల్లి: నీటి సంపులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో వట్టెంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని వట్టెంలో కర్ణాటకకు చెందిన లోకేష్ (35) కొన్నేళ్లుగా మండలంలోని పాలెంలో వచ్చి బేకరి నిర్వహించగా, నష్టాలు వస్తుండటంతో బేకరీని వట్టెంకు కొన్ని నెలల కిందట మార్చాడు. ఈ క్రమంలో వట్టెంలో తాను నివాసం ఉంటున్న ఇంట్లో శనివారం సాయంత్రం నీటి సంపును శుభ్రం చేయాలని అందులోకి దిగాడు. భార్య లావణ్య చాలా సేపటి నుంచి భర్త కన్పించడం లేదని వెతికింది. సంపు వద్ద తన భర్త చెప్పులు ఉండటం గమనించి సంపులోకి చూసింది. అందులో లోకేష్ మృతి చెంది కన్పించాడు. మృతదేహాన్ని కర్ణాటకకు తరలించడానికి వట్టెం గ్రామ ప్రజలు తమవంతు సాయం అందించారు.

దైవదర్శనానికి వెళ్తుండగా రైలులో వ్యక్తి..

గద్వాల క్రైం: గుండెపోటుతో రైల్వే ప్రయాణికుడు మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం మేడ్చల్‌కు చెందిన గొడ్డల ఈశ్వర్ (41) కుటుంబ సభ్యులతో కలిసి మధురై దేవాలయ దర్శనం కోసం కాచిగూడ నుంచి మధురై వెళ్తున్న రైలెక్కారు. మహబూబ్‌నగర్ స్టేషన్ దాటిన తర్వాత ఈశ్వర్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు 108ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గద్వాల స్టేషన్‌కు చేరుకున్న వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈశ్వర్ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నట్లు బంధువులు తెలిపారు. మరోసారి గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చెన్నంపల్లిలో విషాదఛాయలు

లింగాల: మండలంలోని చెన్నంపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం చెన్నంపల్లి మాజీ ఎంపీటీసీ అరుణ కుమార్తె సింధూ(26) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, మృతురాలి బంధువులు ఆవేశానికి గురై భర్త నాగార్జునను చితకబాదడంతో ఆయన కూడా మృతి చెందడంతో కుటుంబంతో పాటు, గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. భార్యభర్తలు చనిపోవడం దురదృష్టకరమని గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలి తల్లిదండ్రులు కొన్నేళ్ల నుంచి అచ్చంపేటలోనే నివాసం ఉంటున్నారు.

పెళ్లికి నిరాకరించారని యువకుడు బలవన్మరణం

బిజినేపల్లి: పెళ్లిచూపుల అనంతరం అమ్మాయి తరపు వారు పెళ్లికి నిరాకరించారని మనస్తాపానికి గురైన కుర్మయ్య (26) పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాడూర్ మండలం అంతారం చెందిన కుర్మయ్య ఈ నెల మొదటి వారంలో పెళ్లి చూపుల్లో భాగంగా ఒక అమ్మాయిని చూశాడు. కానీ ఆ అమ్మాయి అతనిని నిరాకరించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆ యువకుడు బిజినేపల్లి మండలంలోని మహాదేవునిపేట సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కుర్మయ్య ఉన్న ప్రాంతానికి వెళ్లారు. అతన్ని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు రెండవ ఎస్‌ఐ గోపాల్‌నాయక్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడికి గాయాలు

- గాలిపటం ఎగురవేస్తుండగా ఘటన

అచ్చంపేట: పట్టణంలోని శ్రీలక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న అస్మా, ఖాజా దంపతుల కుమారుడు జోయేత్ ఇంటిపై శనివారం గాలిపటం ఎగరవేస్తుండగా విద్యుత్ లైన్‌కు మాంజా (ధారం) తగలడంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స నిర్వహించి హైదరాబాద్ తరలించారు. ధారం చక్రం కడుపు వద్ద పెట్టుకొని ఎగరవేస్తుండటం వల్ల పెద్ద రంధ్రం పడినట్లు తెలిసింది.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

బీచుపల్లి వద్ద అగ్నికి ఆహుతైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- స్థానికులు, హైవే సిబ్బంది చొరవతో తప్పిన ప్రాణనష్టం
- వరుస ప్రమాదాలతో స్థానికుల ఉలిక్కిపాటు
- 2013లో పాలెం దుర్ఘటనలో 45 మంది సజీవ దహనం

బస్సులో అర్ధరాత్రి ప్రయాణం అందరూ గాఢనిద్రలోకి జారుకున్నారు.. తెల్లవారితే గమ్యస్థానాలకు చేరుకుని.. బంధుమిత్రులతో కలిసి సంతోషంగా పండుగను జరుపుకొందాం అనుకున్నారు.. అయితే.. తానొకటి తలిస్తే.. దైవం మరొకటి తలచింది అన్నట్టు.. కానీ, ఒక్క ప్రమాదం అందరి ఆశలను కకావికలం చేసింది.. డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్ల బస్సు ఒక్కసారిగా బోల్తాపడి.. వేగంగా మంటలు వ్యాపించాయి.. ఉలిక్కిపాటుతో మేల్కొన్న ప్రయాణికులు.. వెంటనే తేరుకొని బస్సులు అద్దాలు బద్దలుకొట్టి కొందరు.. స్థానికుల చొరవతో మరికొందరు చిన్నపాటి గాయాలతో బయటపడగా.. ఓ మహిళ మంటల్లో చిక్కుకొని సజీవ దహనమైంది.. అయితే స్థానికులు, హైవే సిబ్బంది చాకచక్యంతో పెను విషాదం త్రుటిలో తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.


గాయపడిన బస్సు డ్రైవర్




బీచుపల్లి వద్ద ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం బీచుపల్లి శివారులోని టెన్త్ బెటాలియన్ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన బస్సు ప్రమాదం.. పదేళ్ల క్రితం కొత్తకోట మండలం పాలెం వద్ద చోటుచేసుకున్న దుర్ఘటనను గుర్తుచేసింది. ఈ ప్రమాదంలో ఎక్కువ మొత్తంలో ప్రాణనష్టం జరగకపోయినప్పటికీ.. మిగతా అన్ని కోణాల్లోనూ ఆనాటి ఘటననే తలపించింది. బస్సు బోల్తాపడి పూర్తిగా దగ్ధం కాగా.. ప్రయాణికులు రెప్పపాటులో ప్రాణాలతో బయటపడగలిగారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. ఏడుగురు గాయాలపాలయ్యారు. అయితే అప్పుడు, ఇప్పుడు కూడా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సే ప్రమాదానికి గురవడం.. రెండు ప్రమాదాలకు నిర్లక్ష్యపు డ్రైవింగ్, నిద్రమత్తే కారణమవడం గమనార్హం. సురక్షితమని భావించి బస్సుల్లో వెళ్తుండగా.. అవే పెను విపత్తులు సృష్టిస్తుండటంతో ప్రయాణికులు భీతిల్లుతున్నారు.

రాత్రివేళలోనే రాకపోకలు..

హైదరాబాద్ నుంచి ఏపీలోని పలు ప్రాంతాలు, బెంగుళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు తిరుగుతుంటాయి. ఇవన్నీ రాత్రిళ్లు అధికంగా రాకపోకలు సాగిస్తాయి. అయితే రాత్రివేళలో ప్రమాదాలు జరగడంతో ప్రాణ, ఆస్తినష్టాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టకపోవడం ఇందుకు ఒక కారణమవుతుంది. 44వ జాతీయ రహదారిలోని పుల్లూరు టోల్‌ప్లాజా నుంచి కొత్తకోట టోల్‌ప్లాజా వరకు అనేక ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.


మాలతి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు


వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీచైర్‌పర్సన్

నిత్యకృత్యంగా ప్రమాదాలు

ఉమ్మడి పాలమూరు జిల్లా మీదుగా వెళ్తున్న 44వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. పెద్ద ప్రమాదాలు జరుగుతూ.. భారీస్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుండటంతో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. 2013 అక్టోబర్ 30న వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం వద్ద జబ్బార్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సైతం షార్ట్‌సర్క్యూట్‌కు గురైంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 45 మంది బయటికి రాలేక సజీవ దహనమయ్యారు. ఇవే కాక ఇటిక్యాల మండలంలో పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులతోపాటు ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురై అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు.

- 2010 డిసెంబర్‌లో గద్వాలకు చెందిన ఒక కుటుంబం తమ చిన్నారికి ఆరోగ్య బాగోలేకపోవడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు ప్రైవేట్ వాహనంలో వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న అదే మార్గంలో వస్తున్న ఓల్వో బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో పసిపిల్లతో సహా 9 మంది మృత్యువాత పడ్డారు.
- 2002లో ఇటిక్యాల మండలం మునగాల శివారులో ఆర్టీసీ బస్సుకు నిప్పంటుకొని బస్సులో ప్రయాణిస్తున్న 16 మంది సజీవ దహనమయ్యారు. అనేక మంది తీవ్ర, స్వల్పగాయలతో బయటపడ్డారు.
- 1994లో ఇటిక్యాల మండలం బీచుపల్లి వద్ద ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కృష్ణానదిలోకి దూసుకెళ్లగా.. 42 మంది జలసమాధి అయ్యారు. ఈ సంఘటన కంటే ముందు 1993లో కడప జిల్లా రాయచోటికి చెందిన ఆర్టీసీ డిపో బస్సు ఇటిక్యాల మండలం బీచుపల్లి వద్ద ప్రమాదవశాత్తు కృష్ణానదిలో పడింది. ఈ ప్రమాదంలోనూ బస్సులో ప్రయాణిస్తున్న 36 మంది జలసమాధి అయ్యారు.

అనారోగ్యంతో చిరుత మృతి

- ఫారెస్ట్ అధికారుల పంచనామా
- మహబూబ్‌నగర్‌కు తరలింపు

దామరగిద్ద: మండలంలోని వత్తుగుండ్ల శివారులో ఉన్న జింక కన్నప్ప పొలం సమీపంలో శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మూడు చిరుతలు సంచరిస్తుండగా స్థానిక రైతులు గుర్తించారు. వత్తుగుండ్ల, కంసాన్‌పల్లి గ్రామాల రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకోగా రెండు చిరుతలు పులిగుట్టకు వైపు పారిపోగా మిగిలిన చిరుత అనారోగ్యంతో పరుగెత్తలేని స్థితిలో అక్కడే ఉండిపోయింది. దీంతో రైతులు దగ్గరుండి ఫొటోలు, వీడియోలు తీశారు. స్థానిక పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి రఘునాథ్‌రావు ఘటన స్థలానికి చేరుకునే సరికి ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫారెస్ట్ అధికారులు పంచానామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు. కాగా పంట పొలాల వద్ద చిరుతలు కనిపించడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. చిరుతలను బంధించి వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలను తరలించాలని కోరుతున్నారు.


మృతిచెందిన చిరుత

రేషన్‌బియ్యం పట్టివేత


పట్టుబడ రేషన్‌బియ్యం

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పూసల్‌పహాడ్‌లో చుట్టు పక్కల ఇళ్లలో సేకరించిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నాగరాజ్ తన ఇంట్లో నిల్వ చేసుకున్నాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పోలీస్‌స్టేషన్‌కు బియ్యం తరలించారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పాముకాటుతో బాలుడికి తీవ్ర అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

కోస్గి: ఇంటి నుంచి బయటకు వస్తున్న క్రమంలో బాలుడు పాము కాటుకు గురై పరిస్థితి విషమంగా మారిన ఘటన గుండుమాల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు గ్రామానికి చెందిన సాత్విక్‌రెడ్డి ఇంటి నుంచి ఆడుకునేందుకు బయటకు వస్తున్న క్రమంలో ఒక్కసారిగా రక్త పింజర పాము కాటు వేసింది. బాలుడు ఒక్కసారిగా అరవడంతో కుటుంబ సభ్యులు వచ్చి పామును కొట్టి చంపారు. బాలుడిని వెంటనే కోస్గి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో పాలమూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల మధ్యే


బహుమతులు అందజేస్తున్న డీకే అరుణ

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

పాలమూరు: అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యే ఉంటానని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్టీఆర్ కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ టికెట్ల విషయంలో అధిష్టానం నిర్ణయం మేరకు నడుచుకుంటామని తెలిపారు. దేవునిపై నమ్మకం, రామునిపై భక్తి ఉన్న వారు ఎవరైనా అయోధ్య నగరానికి రావచ్చని అన్నారు. కుల, మత రాజకీయాలు చేయడం కాంగ్రెస్ పార్టీ అలవాటన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణ దశలో ఉన్నదని, జనవరి 22వ తేదీ నక్షత్రం మంచి రోజు కావడం వల్ల బాలరాముని ప్రతిష్ఠకు పండితులు ముహూర్తాన్ని ఖరారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మజారెడ్డి, జయశ్రీ, సాహితిరెడ్డి, నిరంజనమ్మ, రామేశ్వరి, కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, కొండయ్య, రాజేందర్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలో పసికందు

- గ్రామస్తులు, పోలీసుల సాయంతో ఆస్పత్రికి తరలింపు


చెత్తకుప్పలో దొరికిన శిశువు

తెలకపల్లి: కనికరం లేకుండా అప్పుడే పుట్టిన ఓ మగశిశువును చెత్తకుప్పలో పడవేసిన ఘటన అందరిని కలిచివేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాళ్లపల్లిలో సాయిలు ఇంటి సమీపంలో శనివారం మధ్యాహ్నం అప్పుడే పుట్టిన మగ శిశువును చెత్తకుప్పల్లో పడవేశారు. చలికి వణుకుతూ ఏడుస్తున్న పసికందును గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పసికందును నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ తరలించినట్లు తరలించారు.

14 గొర్రెలు, మేక అపహరణ


చోరీపై విచారణ చేస్తున్న ఎస్‌ఐ గురుస్వామి

ఉప్పునుంతల: మండలంలోని రాయిచేడ్‌లో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. జాజాల శ్రీనుకు ఇంటి ఎదుట పాగలో ఉంచిన 14 గొర్రెలు, మేకను అపహరించుకుపోయారు. శుక్రవారం రాత్రి శ్రీను కుటుంబ సభ్యులు ఇంట్లో పడుకోగా తండ్రి బిచ్చయ్య మాత్రం మంచంపై గొర్రెల మంద పక్కనే పడుకున్నాడు. రాత్రి 11.30 సమయంలో గుర్తు తెలియని దొంగలు వాహనంలో అక్కడకు చేరుకొని మొదట ఇంటి ముందు ఉన్న కరెంట్ బల్బును తీసివేయడంతోపాటు ఇంటి తలుపుకు బయట వైపు నుంచి గడియపెట్టారు. 14 గొర్రెలను, మేకను దొంగలు వాహనంలో వేసుకున్నారు. గొర్రెల అరుపుతో అలజడి కావడంతో ఇంట్లో ఉన్న వారు నిద్రమేల్కొని బయటకు రావడానికి వీలులేక గట్టిగ అరవడంతో దొంగలు వాహనంతో పాటు పారిపోయారు. ఆ తర్వాత నిద్రమేల్కొన్న బిచ్చన్న తలుపు గడియ తీయడంతో బయటకు వచ్చిన శ్రీను కుటుంబ సభ్యుల అరుపులు విని ఇరుగుపొరుగు వారు నిద్రలేచారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురుస్వామి, పోలీసులు రాత్రి గ్రామానికి వెళ్లి రోడ్లపై వెతికినా దొంగల ఆచూకీ దొరకలేదు. చోరీకి గురైన గొర్రెలు, మేక విలువ రూ. 2 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. శనివారం బాధిత గొర్రెల యజమాని ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

గర్భిణిపై కుక్క దాడి: తీవ్ర గాయాలు


జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరుణ

కొత్తకోట రూరల్: గర్భిణిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన పెద్ద మందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత మహిళ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పామిరెడ్డిపల్లికి చెందిన కుర్వ పోషన్న కుమార్తె అరుణ గర్భిణి. శుక్రవారం సాయంత్రం ఆమె రోడ్డుపై వెళ్తుండగా అకస్మాత్తుగా కుక్క దాడి చేయడంతో కిందపడిపోయింది. దీంతో కుక్క ఒక్కసారిగా ఆమెపై దూకి కరవడంతో తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం గ్రామానికి చెందిన తెలుగు శివ కుమార్తె మూడేళ్ల తేజశ్రీపై కూడా కుక్క దాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. చుట్టుపక్కల వారు గమనించి దానిని తరిమారు. గతంలో కూడా పలువురిపై కుక్కలు దాడి చేశాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శించారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన వాహనం

- కాపరితో సహా ఆరు గొర్రెలు మృతి


శివ (ఫైల్)

కేటీదొడ్డి: కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా ఏడుమైళ్ల చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై కల్మాలకు వెళ్లే రహదారిపై వెళ్తున్న గొర్రెల మందపై గుర్తు తెలియని వాహనం దూసుకెళ్లింది. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండల కేంద్రానికి చెందిన శివ(27) రెండు వందలకు పైగా గొర్రెల పెంపకం చేపట్టారు. శనివారం తెల్లవారుజామున శివతో పాటు మరో ఇద్దరు మందను మేపడం కోసం కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ జిల్లాలోని ఓ ప్రాంతానికి తీసుకెళ్తున్న క్రమంలో ఏడు మైళ్ల చౌరస్తా వద్ద వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొటింది. ఈ ప్రమాదంలో 6 గొర్లతో పాటు యాజమాని శివపై కూడా వాహనం వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడిఅక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వరికోత యంత్రాన్ని ఢీకొన్న లారీ


జాతీయ రహదారిపై బోల్తా పడిన వరికోత మిషన్

ఉండవెల్లి: జాతీయ రహదారిపై వరికోత యంత్రానికి ఓవర్ టేక్ చేయబోయి లారీ ఢీకొన్న ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన వరికోత యంత్రాన్ని కర్నూల్ వైపు డ్రైవర్ సాయిని శంకర్ తీసుకెళ్తున్నాడు. సోలాపూర్ నుంచి చెన్నైకు వెళ్తున్న ఉల్లిగడ్డల లారీ ఓవర్ టెక్ చేయడంతో వరికోత మిషన్ బోల్తా పడింది. దీంతో సాయిని శంకర్, అనిల్‌కు గాయాలయ్యాయి. లారీలో ఉన్న 30 టన్నుల ఉల్లిగడ్డలలో 20 సంచుల వరకు రోడ్డుపాలయ్యాయి. రహదారిపై వాహనాలు స్తంభించిపోవడంతో పోలీసులు చేరుకుని క్రమబద్ధీకరించారు.


రోడ్డుపాలైన ఉల్లిగడ్డలు

గద్దర్‌పై పాట విడుదల


సీడీని ఆవిష్కరిస్తున్న ప్రొ.కాశీం

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు పంచాయతీ అనుబంధ గ్రామమైన గోపన్నపల్లికి చెందిన చంద్రశేఖర్ గద్దర్‌పై పాట రాయగా ఓయూ ప్రొ.డా. కాశీం సీడీని శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. 'పొడిసేటి పొద్దుల్లో వెలుగైనవా' పాట సీడీని ఆవిష్కరించి చంద్రశేఖర్‌ను అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అనుదీప్, నారాయణ, గోపి, అశోక్, ప్రవీణ్,దేవి, సంతోష్,రాకేష్ తదితరులు ఉన్నారు.

అడ్డంగా దొరికిన 'రింగ్' మాస్టర్

ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట చంద్రబాబు భూ దోపిడీ

- చంద్రబాబు, నారాయణ, లింగమనేని భూములను ఆనుకుని అలైన్‌మెంట్
- ముందుగా అనుకున్న అలైన్‌మెంట్‌కు కన్సల్టెన్సీ ద్వారా రాజముద్ర
- తద్వారా పచ్చ ముఠా భూముల విలువ అమాంతం పెంపు
- రూ.2 వేల కోట్లకుపైగా దోపిడీ
- పూర్తి ఆధారాలతో వెలికి తీసిన సీఐడీ



సాక్షి, అమరావతి: కట్టని రాజధాని.. నిర్మించని ఇన్నర్ రింగ్ రోడ్.. కావేవీ భూ దోపిడీకి అనర్హం అన్నట్టుగా టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎంగా చంద్రబాబు చెలరేగిపోయారు. రాజధాని అమరావతి ముసుగులో యథేచ్ఛగా భూ దందా సాగించారు. కాగితాల మీదే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఇష్టానుసారం మార్పులు చేసి, వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టడం తనకే సాధ్యమని నిరూపించారు. గత ప్రభుత్వంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా అప్పటి సీఎం చంద్రబాబు, వైస్ చైర్మన్‌గా అప్పటి మంత్రి పొంగూరు నారాయణ బరితెగించి పాల్పడ్డ అవినీతి విస్మయ పరుస్తోంది. అందుకోసం లింగమనేని రమేశ్‌తో క్విడ్ ప్రో కోకు పాల్పడిన ఈ కేసులో లోకేశ్ కూడా ప్రధాన పాత్ర పోషించారు. చంద్రబాబు బినామీ, సన్నిహితుడు లింగమనేని భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి రూ.877.50 కోట్లకు.. రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం భారీ దోపిడీకి నిదర్శనం. ఈ అవినీతి పాపంలో చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కు కూడా వాటా ఇవ్వడం కొసమెరుపు. ఈ కుంభకోణాన్ని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పూర్తి ఆధారాలతో సహా వెలికి తీసి కేసు నమోదు చేసింది.

అలైన్‌మెంట్ బాబుది.. ముద్ర కన్సల్టెన్సీది

అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్ కోసం సీఆర్‌డీయే అధికారులు 94 కిలోమీటర్ల పొడవుతో అలైన్‌మెంట్ రూపొందించారు. ఆ ప్రకారం అమరావతిలోని చంద్రబాబు, లింగమనేని, నారాయణ కుటుంబాలకు చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి పెద్దమరిమి, నిడమర్రు, చిన వడ్లపూడి, పెద వడ్లపూడి మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మించాలి. దాంతో తమ భూముల విలువ పెరగదని గ్రహించిన చంద్రబాబు, నారాయణ.. సీఆర్‌డీయే అధికారులపై మండిపడ్డారు. వారిద్దరి ఆదేశాలతో సీఆర్‌డీయే అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. అలైన్‌మెంట్‌ను 3 కిలోమీటర్లు దక్షిణానికి జరిపి.. తాడికొండ, కంతేరు, కాజాలలోని చంద్రబాబు, లింగమనేని కుటుంబాలకు చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 13 ఎకరాలను ఆనుకుని నిర్మించేలా ఖరారు చేశారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి చంద్రబాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేశ్ సంస్థల పేరిట ఇన్నర్ రింగ్ రోడ్డుకు అటూ ఇటూ భారీగా భూములు కొన్నారు. అనంతరం సింగపూర్‌కు చెందిన సుర్బానా జ్యురాంగ్ కన్సల్టెన్సీని రంగంలోకి తెచ్చారు. అప్పటికే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్ డిజైన్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. అనంతరం ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించారు. కానీ మాస్టర్ ప్లాన్‌లో పొందు పరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే ఉండాలని షరతు విధించారు. అంటే అప్పటికే సీఆర్‌డీయే అధికారుల ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించేలా చేశారు.

రూ.177.50 కోట్ల నుంచి రూ.877.50 కోట్లు

ఎత్తుగడల వల్ల చంద్రబాబు, లింగమనేని రమేశ్ కుటుంబాలకు చెందిన భూముల విలువ భారీగా పెరిగింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు ఆ ప్రాంతంలో ఎకరా భూమి మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉండేది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ తర్వాత మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతం రూ.887.50 కోట్లకు పెరిగినట్టే. ఇక రాజధాని అమరావతి నిర్మాణం పూర్తయితే ఎకరా విలువ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో రూ.4 కోట్లకు చేరుతుందని సీఎం హోదాలో చంద్రబాబు ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. మార్కెట్ ధర ప్రకారం హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. రాజధాని నిర్మాణం పూర్తయితే అది రూ.54 కోట్లకు చేరుతుందని లెక్క తేలింది.

పవన్ కల్యాణ్‌కూ 2.40 ఎకరాల ప్యాకేజీ

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్ రింగ్ రోడ్డు అవినీతి పాపంలో పిడికెడు వాటా ఇచ్చారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే ఆయనకు 2.4 ఎకరాల భూమి ఉంది. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్టు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

బాబు, నారాయణ ఆస్తుల అటాచ్‌మెంట్

క్విడ్ ప్రో కో కింద చంద్రబాబు పొందిన కరకట్ట నివాసాన్ని, నారాయణ కుటుంబ సభ్యులు సీడ్ క్యాపిటల్‌లో పొందిన 75,888 చదరపు గజాల ప్లాట్లు, కొలు మొత్తంగా పొందిన రూ.1.92 కోట్లను అటాచ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది.

ఐఆర్ఆర్ కేసులో నిందితులు

ఏ-1: చంద్రబాబు, ఏ-2: నారాయణ
ఏ-3: లింగమనేని రమేశ్, ఏ-4: లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్, ఏ-5: కేపీవీ అంజని కుమార్ (రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్)
ఏ-6: హెరిటేజ్ ఫుడ్స్, ఏ-7: ఎల్ఈపీఎల్ ప్రాజెక్ట్స్, ఏ-14: లోకేశ్

కృష్ణా నదికి ఇవతలా అవినీతి మెలికలే

- సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్ రింగ్ రోడ్డును గుంటూరు జిల్లాలోని అమరావతి నుంచి కృష్ణా జిల్లాలోని నున్న మీదుగా నిర్మించాల్సి ఉంటుంది. అందుకోసం గుంటూరు జిల్లాలోని నూతక్కి - కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించాలి. అక్కడి నుంచి తాడిగడప - ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అలా నిర్మిస్తే నారాయణ సంస్థల భవనాలను భూసేకరణ కింద తొలగించాల్సి వస్తుంది.
- ఈ అలైన్‌మెంట్‌పై నారాయణ సీఆర్‌డీఏ అధికారులపై మండిపడ్డారు. ఆయన ఆదేశాలతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు. ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం - కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మిస్తారు. అక్కడి నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మిస్తారు. దాంతో నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్‌ను ఖరారు చేశారు.

'హెరిటేజ్ ఫుడ్స్'కు భూములు

- ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పడం ద్వారా లింగమనేని కుటుంబానికి కల్పించిన ప్రయోజనానికి ప్రతిగా చంద్రబాబు హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు పొందారు. ఈ ప్రక్రియలో అప్పటి హెరిటేజ్‌ఫుడ్స్ డైరెక్టర్ హోదాలో లోకేశ్ కీలక భూమిక పోషించారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని ఉన్న కంతేరు గ్రామంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాలు పొందారు.
- 2014 జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య ఈ భూములను హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసినట్టు చూపించారు. అంతే కాకుండా లింగమనేని కుటుంబం నుంచి మరో 4.55 ఎకరాలు కొనుగోలు పేరిట హెరిటేజ్ ఫుడ్స్ దక్కించుకుంది. కానీ అప్పటికే ఈ కుంభకోణం గురించి బయటకు పొక్కడంతో ఆ సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకునే లింగమనేని కుటుంబానికి చెందిన 355 ఎకరాలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉండటం గమనార్హం.
- క్విడ్ ప్రో కోలో భాగంగా లింగమనేని రమేశ్ కృష్ణా నది కరకట్ట మీద ఉన్న తమ బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. దీనిపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారానికి మసి పూసేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఆ బంగ్లాను అద్దెకు ఇచ్చానని లింగమనేని రమేశ్ చెప్పారు. కానీ ఆయన అద్దె వసూలు చేసినట్టుగానీ చంద్రబాబు చెల్లించినట్టుగానీ ఆదాయ పన్ను వివరాల్లో లేవు.
- తర్వాత ఆ ఇంటిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని చెప్పారు. మరి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నుంచి హెచ్ఆర్ఏ ఎందుకు పొందారని ప్రశ్నించేసరికి జవాబే లేదు. దాంతో ఆ బంగ్లాను చంద్రబాబుకు వ్యక్తిగతంగా క్విడ్ ప్రో కో కింద ఇచ్చారన్నది స్పష్టమైంది.


సంక్రాంతి వేడుకలకు ముస్తాబవుతున్న తాడేపల్లిలోని సీఎం జగన్ నివాస ప్రాంగణం

సీఎం జగన్ ఇంట నేడు సంక్రాంతి సంబరాలు

సాక్షి, అమరావతి: ముత్యాల ముగ్గులు, మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట నేడు సంక్రాంతి శోభ వెల్లివిరియనుంది. రైతులు, పల్లె ప్రజలతో కలిసి ఏటా సంక్రాంతి వేడుకలు నిర్వహించుకోవడం సీఎం జగన్‌కు ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఈనెల 14న (ఆదివారం) సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నారు. నవరత్నాలతో ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించిన నేపథ్యంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలు, మెడికల్ కాలేజీ, నాడు-నేడు స్కూల్, పాల కేంద్రం నమూనాలు, ఎండ్లబండ్లు, గ్రామీణ ఇళ్లతో పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఏర్పాట్లుచేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులు వీటిని అద్భుతంగా తీర్చిదిద్దారు. వందేళ్ల క్రితం తిరుమల ఏ విధంగా ఉండేదో అదే తరహాలో ఇక్కడ ప్రత్యేకంగా సెట్టింగ్ ఏర్పాటుచేశారు.

సీఎం జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అంటేనే అచ్చ తెలుగు పండుగని.. గ్రామానికి నూతన శోభను తెచ్చే పర్వదినమని.. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రోజని ఆయన అన్నారు. భోగి మంటలు.. రంగ వల్లులు.. హరిదాసుల కీర్తనలు.. గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, పైరుపచ్చల కళకళలు.. రైతు లోగిళ్లలో ధాన్యం రాశులు.. పిండి వంటల ఘుమఘుమలు.. బంధుమిత్రుల సందళ్లతో కనువిందు చేసే మనందరి పండుగ సంక్రాంతి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

నిరుద్యోగులకు సంక్రాంతి కానుక

- పండుగ తరువాత మెగా డీఎస్సీ నోటిఫికేషన్
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: ఏపీలో టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం సంక్రాంతి కానుక ప్రకటించింది. పండుగ తరువాత మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విశాఖ ఎయిర్‌పోర్టులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీ, విధి విధానాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఏ హామీలిచ్చారో వాటన్నింటినీ తూచా తప్పకుండా అమలుచేశారని ఆయన గుర్తుచేశారు. ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల సమస్యలను అతి దగ్గరగా చూసి వాటిని వంద శాతం అమలుచేసి దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారన్నారు. మహానేత వైఎస్సార్ హయాంలో ఏపీ అభివృద్ధి బాటపడితే.. ఇప్పుడాయన తనయుడు జగన్ హయాంలో అంతకు రెట్టింపు అభివృద్ధి, సంక్షేమం ఏపీలో జరిగిందన్నారు.

మూడు నెలల క్రితమే వివరాల సేకరణ

మరోవైపు.. అన్ని జిల్లాల్లోను వివిధ మేనేజ్‌మెంట్లలో ఉన్న ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను అందించాలని మూడునెలల క్రితమే డీఈఓలు, ఆర్జేడీలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేసి, వివరాలు సేకరించింది. డైరెక్ట్ నియామకాలకు అనుగుణంగా పోస్టుల రోస్టర్ రిజిస్టర్లతో సహా సమగ్ర సమాచారాన్ని డీఎస్సీ నోటిఫికేషన్ సూచించిన ప్రొఫార్మాలో తీసుకున్నారు. అన్ని అంశాలను క్రోడీకరించి, ఖాళీల ఆధారంగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వనుంది.

16న శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రధాని పర్యటన

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రంలో పర్యటించనున్నారు. ఆరోజు మధ్యాహ్నం ప్రధాని పాలసముద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్‌ను సందర్శిస్తారు. అనంతరం జరిగే సభలో పాల్గొంటారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం అధికారులతో సమీక్షించారు. ప్రధాన మంత్రి పర్యటనలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.

కొండల్లో కొలువైన ఉమామహేశ్వరుడు


నల్లమలలో వెలసిన ఉమామహేశ్వర క్షేత్రం

- 15నుంచి 22 వరకు బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారంగా బాసిల్లుతున్న ఉమామహేశ్వర క్షేత్రం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. మండలంలోని రంగాపూర్ పంచాయతీ పరిధిలో నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వరుడి ఉత్సవాలు మకర సంక్రాంతి సందర్భంగా ఉత్తరాయణంలో ఈనెల 15నుంచి 22 వరకు వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎత్తైన కొండలపై..

500 అడుగుల ఎత్తైన నల్లమల కొండలపై ఉమామహేశ్వర క్షేత్రం వెలసింది. పురాణ ప్రసిద్ధిగాంచిన శ్రీశైల క్షేత్రంకు ఉత్తర ద్వారంగా ఉమాశక్తి పీఠంగా ఉమామహేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి చెందింది. రావణాసురుని చంపిన తదుపరి శ్రీరాముడు శ్రీశైలం ప్రదక్షిణను ఉమామహేశ్వర క్షేత్రం నుంచి ప్రారంభించినట్లు స్థల పురాణం చెబుతుంది. అహోబిలం, మహానంది, శ్రీశైలం తదితర పుణ్య క్షేత్రాలు వెలసిన నల్లమల ప్రాంతంలోనే ఈ క్షేత్రం ఉంది. రెండు కొండలు ఒకదానిపై ఒకటి అమర్చినట్లు ఉండటం విశేషం. మొదటి కొండపై రెండోది 20 అడుగుల ఎత్తున ఉంటుంది. కింది కొండ విశాలంగా ఉండగా పైన ఉన్న కొండ కేవలం ఐదు అడుగుల వెడల్పు మాత్రమే ఉంది.


ఉమామహేశ్వరం కొండపైకి మెట్లదారి

స్వామి వారి బ్రహ్మోత్సవాలు

14న ఆదివారం సాయంత్రం 4గంటలకు అయ్యప్ప పూజ, సాయంత్రం 6గంటలకు మకర జ్యోతి దర్శనం అనంతరం మంగళ హారతి ఉంటుంది. 15న సోమవారం సాయంత్రం 6:30గంటలకు అంకురార్పణం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపన, బలిహరణం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. రాత్రి 8 గంటలకు అచ్చంపేట భ్రమరాంబ దేవాలయం, వివిధ గ్రామాల నుంచి అలంకరణాలతో ఏర్పాటు చేసిన ప్రభలు ఉమామహేశ్వరానికి వస్తాయి. రాత్రి 2గంటలకు స్వామి వారు ఉమామహేశ్వరంకొండపై నుంచి మంగళవాయిద్యాలతో పల్లకీసేవతో కిందకు వస్తారు. అచ్చంపేట నుంచి ప్రభోత్సవం భోగమహేశ్వరం చేరుకోగానే 16న మంగళవారం తెల్లవారుజామున 4గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం దిగువ భోగమహేశ్వరంలో అంగరంగ వైభవంగా జరుగుతాయి. అదేరోజు రాత్రి 7గంటలకు పల్లకీసేవ ఉంటుంది. 17న బుధవారం రాత్రి 7గంటలకు అశ్వవాహనసేవ, 18న గురువారం రాత్రి 7గంటలకు నందివాహనసేవ ఉంటుంది. 16 నుంచి 22 వరకు ఉత్తరాయణ పుణ్యకాల స్నానములు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

సౌకర్యాలు కల్పిస్తున్నాం..



ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. రోడ్డు మార్గంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం. దాతల సహకారంతో రెండేళ్లుగా నిత్య అన్నదానం చేస్తున్నాం. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు.

– సుధాకర్, ఆలయ కమిటీ చైర్మన్

ఉత్సాహంగా..

- ప్రారంభమైన నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్
- హాజరైన 28 రాష్ట్రాల జట్లు


తలపడుతున్న మహారాష్ట్ర, జార్ఖండ్ జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని క్రీడాశాఖ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో శనివారం 2వ ఫాస్ట్-5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఉత్సాహంగా ప్రారంభమైంది. పోటీల ప్రారంభోత్సవంలో డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఐ) సెక్రటరీ జనరల్ విజేందర్‌సింగ్, కాంగ్రెస్ నాయకుడు కె.అక్షదీప్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఎమ్మెల్యే టాస్‌వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా ఫాస్ట్-5 నేషనల్ నెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తుండటం అభినందనీయమని అన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను కోరారు.

కిటకిటలాడిన ఇండోర్ స్టేడియం..

నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో దేశంలోని 28 రాష్ట్రాల నుంచి పురుషులు, మహిళా జట్లు పాల్గొంటున్నాయి. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో మొదటిసారిగా నేషనల్ నెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఇండోర్ స్టేడియంలో ఫాస్ట్-5 సౌత్‌జోన్, ట్రెడిషనల్ సౌత్‌జోన్ నెట్‌బాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో ఇండోర్ స్టేడియం కిటకిటలాడింది. ఇండోర్ స్టేడియంలోని రెండు కోర్టుల్లో నేషనల్ నెట్‌బాల్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు గిరిష్ సి.గౌడ, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రం ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సాదత్‌ఖాన్, కోశాధికారి సోహైల్‌ఖాన్, రామ్మోహన్‌గౌడ్, సయ్యద్ అంజద్‌అలీ, షకీల్, అక్రం, షరీఫ్, సిరాజ్‌ఖాద్రీ, ఆనంద్‌గౌడ్, మొయిన్‌అలీ పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పురుషుల విభాగంలో హర్యానాదే విజయం

ఫాస్ట్-5 నేషనల్ నెట్‌బాల్ పోటీల్లో శనివారం మొదటి రోజు పురుషుల విభాగంలో హర్యానా జట్టు విజయం సాధించింది. హర్యానా జట్టు 44-22 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై గెలుపొందింది. మహిళల విభాగంలో బీహార్ జట్టు 29-11 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది.





చిన్నరాజమూర్ అంజన్నకు పూజలు

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామికి శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. గత నెల 24 నుంచి ప్రారంభమైన ఉత్సవాలలో భాగంగా మూడు వారాల నుంచి జాతర కొనసాగుతుంది. శనివారం దేవాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ప్రస్తుతం ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. దేవాలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకారం చేశారు. సాయంత్రం పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఛేదించాలి

- ఎన్ఎంఐఎంఎస్ డైరెక్టర్ ప్రొ. డా. సిద్ధార్థ ఘోష్



మాట్లాడుతున్న ప్రొ. డా. సిద్ధార్థ ఘోష్

రాజాపూర్: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకొని తల్లిదండ్రుల కల నెరవేర్చాలని ఎన్ఎంఐఎంఎస్ డైరెక్టర్ ప్రొ. డా. సిద్ధార్థ ఘోష్ కోరారు. శనివారం పోలేపల్లి సెజ్‌లోని ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీ 21వ ఆవిర్భావ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత విద్యారంగంలో 42 ఏళ్ల అనుభవం ఉన్న ముంబైకి చెందిన ఈ విద్యాసంస్థకు యూజీసీ నుంచి డీమ్డ్ యూనివర్సిటీ హోదా వచ్చి నేటికీ 21 సంవత్సరాలు పూర్తి కావడం సంతోషించదగ్గ విషయమన్నారు. పాలమూరు జిల్లాలో 17 డిపార్ట్‌మెంట్లు, 850 మంది బోధనా సిబ్బందితో 26 వేలకు పైగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం జడ్చర్ల క్యాంపస్‌లో ఎంబీఏ, బీ-ఫార్మసీ, లా-కోర్సుతో పాటు బీటెక్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి ఉద్యోగ అవకాశాలు చూపించడమే యునివర్సిటీ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులు బాగా చదివి జడ్చర్ల క్యాంపస్‌ను ముందువరుసలో నిలపాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ మహేష్‌కుమార్, ప్రొ. అశ్విని దేశ్‌పాండే, డా. ప్రకాష్ చంద్రారుఖా, ప్రొ. చంద్రకాంత్‌వాణి, విద్యార్థుల తల్లిదండ్రులు కొప్పెరి బచ్చిరెడ్డి, వెంకట్ రాజ్, మల్లేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకే టికెట్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేతలకు టికెట్లు కేటాయించాలని బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బీసీ సమాజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 70 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా న్యాయం జరగదని అన్నారు. పేరుకే బీసీలకు న్యాయం చేస్తామని చెప్పే పార్టీల అధ్యక్షులు ఇప్పటికైనా పునరాలోచన చేయాలని కోరారు. బీసీలను ఆదుకోవడంలో అన్ని ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రాజకీయపరంగా, విద్యాపరంగా చైతన్యవంతమైనప్పుడే బీసీ కులాలు ఆర్థికంగా నిలబడగలుగుతామని అన్నారు. బీసీలకే టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అధిష్టానంకు బీసీ సమాజ్ తరపున లేఖలు రాస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బీసీలకు కాకుండా రెడ్లకు టికెట్లు కేటాయిస్తే ఆయా పార్టీలను ఓడిస్తామని అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఇద్దరు మాత్రమే బీసీ అభ్యర్థులు పార్లమెంటుకు ఎన్నికయ్యారని, 70 శాతం ఉన్న బీసీలంతా ఐక్యతతో తమ ఓటు తమ వేసుకుందామని నినాదంతో ముందుకెళ్లి ఈసారి పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థిని పార్లమెంట్ పంపుదామని ఆయన అన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుని బీసీ అభ్యర్థులను ప్రకటిస్తే సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ సవారి సత్యం, జిల్లా కన్వీనర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.